మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 133 ఆదివారం 02 - 11 - 2025 పేజీలు: 8 వెల: 4

## ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు చేయాలి



3లో..

## పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : పేదల ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని, ఆ దిశగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరితో కలిసి ఎంపీ బస్తిపాటి నాగరాజు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీని చేశారు. నూర్జబి, బోయ పద్మావతి లకు వితంతువు పెన్షన్, ఖాజా హుస్సేన్, అజ్గర్ బాషా లకు వికలాంగుల పెన్షన్, మహబూబ్ బాషా కి వృద్ధాప్య పింఛన్ సొమ్మును కలెక్టర్, కర్నూలు అందజేశారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి నగదు అందజేసిన కలెక్టర్, ఎంపీ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ ప్రతినెలా సరైన సమయానికి వచ్చి అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 2 లో..

## కాశీబుగ్గ ఘటనపై సీఎం చంద్రబాబు ఆవేదన

- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



పెద్దన్నవారిపల్లి, నవంబర్ 1 :మనగళం, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో చోటుచేసుకున్న దుర్ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని రేపింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గంభీరంగా స్పందించారు. తుఫాను వంటి ప్రకృతి విపత్తుల్లో కూడా ప్రజల ప్రాణాలను రక్షించగలిగిన ప్రభుత్వం, ఇప్పుడు కొందరు ప్రైవేట్ వ్యక్తుల నిర్లక్ష్యం వల్ల జరిగిన ఈ ప్రాణనష్టం ఎంతో బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎంత కష్టపడ్డా, కొందరి బాధ్యతా రాహిత్య చర్యలు సమాజానికి తీవ్రమైన నష్టం కలిగిస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ సత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లిలో పేదల సేవా కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో కాశీబుగ్గ ఘటనలో మృతి చెందిన భక్తుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముందుగానే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే భక్తులను క్యూలైన్లలో క్రమపరచి, ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు ప్రజా కార్యక్రమాలు నిర్వహించే సమయంలో తగిన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని, ఇకపై అలాంటి నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు.

అంతేకాక, ఘటనకు కారణమైన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు, జిల్లా యంత్రాంగానికి సీఎం ఆదేశించారు. ప్రాణ నష్టం జరిగిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించడమే కాక, వారికి ఆర్థిక, మానసిక పరమైన మద్దతు ఇవ్వాలని కూడా సూచించారు.

"ప్రజల ప్రాణాలు అత్యంత విలువైనవి. ఏ కార్యక్రమం జరిగినా, భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుంది" అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కాశీబుగ్గ ఘటనను ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తున్నదని, బాధ్యులపై చర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు.

## ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- మెరుగైన వైద్యం అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం
- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి




మనగళం, ప్రత్యేక ప్రతినిధి : ప్రజారోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ ప్రాధన్యతనిస్తున్నాయని ప్రముఖ రేడియాలజిస్ట్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక ఆలోచనలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందజేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అన్నారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రేడియాలాజిస్ట్, ఇమేజింగ్ అసోసియేషన్ 11వ రాష్ట్ర కాన్ఫెరెన్స్- 2025 కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ 2 లో..

## కర్నూలు ఉత్సవ్ ర్యాలీని ప్రారంభించిన టీజీ వెంకటేష్



మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రం, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక తెలుగు నాటక రంగ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్నూలు ఉత్సవ్ 2025 ర్యాలీని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి సి క్యాంపు సెంటర్లో ఉన్న టీజీవి కళాక్షేత్రం వరకు కొనసాగింది. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక నాటక రంగా అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త బివి రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి పుల్లయ్య ,తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ డిజిపి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూల్ నగరంలో కర్నూల్ ఉత్సవ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని చెప్పారు . వారం రోజులపాటు కర్నూలు చరిత్రను ప్రపంచానికి తెలిసేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించడం అభినందనీయమని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాత్రికి రాత్రి రాలేదని, అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో వచ్చిందని 2 లో..

## పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

- మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి




మనగళం, నంద్యాల టౌన్: మొంథా తుపాను ప్రభావం మూలంగా పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మొంథా తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన పంట పొలాలు, నష్ట ప్రభావిత ప్రాంతాలపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, నందికొట్కూరు శాసనసభ్యులు గిత్తా జయసూర్యతో కలిసి అధికారులతో సమీక్షించారు. అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్. ఎం. డీ. ఫరూక్ మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానంగా పంట నష్టం చోటుచేసుకుందని, నిష్పక్షపాతంగా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనాలను లెక్కించి నివేదికలు సమర్పించాలని ఆదేశించామని పేర్కొన్నారు. రైతులందరికీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. వాగులు, వంకలు, కుందూ నది పొంగి ప్రవహించిన నేపథ్యంలో 'రివర్స్ స్ట్రాటజీ' ద్వారా నీటిని మళ్లించడం వల్ల నంద్యాల పట్టణాన్ని పెద్ద ప్రమాదం నుండి కాపాడగలిగామని తెలిపారు. తుపాను ప్రభావం కారణంగా మున్సిపాలిటీకి కూడా గణనీయమైన నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నిత్యం పర్యవేక్షిస్తూ జిల్లా యంత్రాంగానికి సమయానుకూల ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించడంతో ప్రజలను సురక్షితంగా 2 లో..

## దేవుడిచ్చిన మంచి అవకాశం... ప్రజలకు మంచి చేయండి

- మానవీయ కోణాన్ని స్పృశిస్తూ ప్రజలకు సేవలందించాలి
- అఖిల భారత సర్వీసుల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి



మనగళం, కర్నూలు సిటీ : అఖిల భారత సర్వీసుల అధికారులుగా దేవుడిచ్చిన మంచి అవకాశం.. సాధ్యమైనంతవరకు ప్రజలకు మంచి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మర్రి చెన్నారెడ్డి మానవ వరుల అభివృద్ధి సంస్థ లో శిక్షణ పొందుతున్న 15 మంది ఐపీఎస్, ఐఎఫ్ఎస్, 2 లో..

# పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అర్హులందరికీ న్యాయం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్నా ప్రతినెలా ఒకటవ తేదీన పింఛన్ అందజేస్తున్నామని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద నవంబర్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 37 వేల 904 మంది లబ్దిదారులకు రూ.103.82 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. అజ్గర్ బాషా కు వైకల్య పెన్షన్ అందచేస్తున్న సమయంలో వైకల్యం ఉన్న సర్టిఫికెట్ లు రైలు ప్రయాణం చేసే సమయంలో పోగొట్టుకున్నానని సర్టిఫికెట్ లు ఇప్పించాలని కలెక్టర్ ను కోరగా, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓ ను ఆదేశించారు.

# దేవుడిచ్చిన మంచి అవకాశం... ప్రజలకు మంచి చేయండి

ఐసీఏఎస్, ఐఎస్ఎస్ లు(అఖిల భారత సర్వీసుల అధికారులు) కల్లూరు మండలం పెద్దటేకూరు, ఓర్వకల్లు మండలం హుసేనాపురం, కర్నూలు రూరల్ మండలం గార్గేయ పురం, కర్నూల్ మున్సిపాలిటీ లలో కార్యకలాపాలను పరిశీలించేందుకు కర్నూలు జిల్లాకు వచ్చారు. ఈ నెల 01 వ తేదీ నుండి 8 వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు శనివారం అఖిల భారత సర్వీసుల అధికారులు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్రాముఖ్యత, పర్యాటక ప్రాంతాలు, ఇతర వివరాల ను గురించి వారికి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనలో మానవీయ కోణాన్ని స్పృశిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. సానుకూల దృక్పథంతో పని చేస్తూ, మనం పని చేస్తున్న ప్రాంతాల అభివృద్ధికి, ఆ ప్రాంత ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, జడ్పీ సీఈవో నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్ అంతటా ఉన్న రేడియాలజీ నిపుణులు ఒకే వేదికపై కలిసి ఆరోగ్యరంగ అభివృద్ధిపై చర్చించడం నిజంగా ప్రేరణనిచ్చే విషయం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్య సేవలలో కొత్త సాంకేతికతలు, నూతన ఆలోచనలతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యరంగంలో అనేక సంస్కరణలు తెచ్చారని, ఐ ఆర్ ఐ ఏ లక్ష్యం కూడా అదేనని ఆమె అభినందించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ఆరోగ్యంగా ఉంటేనే ఏ రంగంలోనైనా



రాణిస్తామని ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి పేర్కొన్నారు.

# పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

కాపాడగలిగామన్నారు. తుపాను సమయంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, అధికార యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించారని మంత్రి ఫరూక్ ప్రశంసించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందన్నారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే అంచనా వేసి అధికారులు అప్రమత్తం చేసినట్లు చెప్పారు. వరద నీరు రివర్స్ దిశగా మళ్లించే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్న నీటిపారుదల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తుపాను సమయంలో జిల్లా యంత్రాంగం వ్యవహరించిన తీరు ఒక కేస్ స్టడీగా నిలిచిందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నేడు మనమంతా ప్రశాంతంగా కూర్చున్నామంటే కారణం క్షేత్రస్థాయిలో అధికారులు సమష్టిగా పనిచేసి తుపాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనడమేనని అన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా పంట నష్టం అంచనా వేయాలని, అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. కేవలం కార్యాలయాల్లో కూర్చుని అంచనాలు వేయొద్దని స్పష్టం చేశారు. 48 గంటల పాటు పంట నీట మునిగితేనే నష్టపరిహారం అందజేస్తామన్న అధికారుల నిర్ణయాన్ని మరోసారి పునఃసమీక్షించి, రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా బాధితులకు నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. అధికారులు తొందరపాటుగా కాకుండా క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఇంత పెద్ద విపత్తు సమయంలో ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాల్సిన సందర్భంలో విమర్శలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావం ప్రధానంగా సముద్ర తీర ప్రాంతాలకు మాత్రమే ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, నంద్యాల జిల్లాలో కూడా ఫ్లాష్ ఫ్లడ్స్ రూపంలో నవంబర్ 27, 28, 29 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎటువంటి విపత్తు సంభవించకుండా పూర్తి స్థాయిలో నిరోధక చర్యలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 30 మండలాలు ఉండగా, అందులో 27 మండలాలు వరద ప్రభావానికి గురై, సుమారు 244 గ్రామాలు వర్షాల వల్ల నష్టపోయినట్లు వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, భోజనం, వసతి వంటి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ముఖ్యంగా నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు మండలాలు ఎక్కువ వర్షాలకు గురై, సుమారు 17,055 మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. జిల్లాలో పంట పొలాలకు సంబంధించి 65 వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసినట్లు తెలిపారు. అందులో 36,948 హెక్టార్ల పంటలు నష్టపోయాయి ఎ వీటిలో 17 వేల హెక్టార్లు వరి, 17 వేల హెక్టార్లు మొక్కజొన్న, మిగతా 2 వేల హెక్టార్లు ఇతర పంటలు అని వివరించారు. పండ్ల తోటలకు సంబంధించి 744 హెక్టార్లు నష్టపోయాయని, ముఖ్యంగా మిరప, పపాయి, ఉల్లి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లాలో సుమారు 27 వేల మట్టి మిద్దెలు ఉండగా, అధిక వర్షాల కారణంగా అక్కడ ఎవరూ ఉండకుండా రెవెన్యూ సిబ్బంది ద్వారా నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. సుమారు 7 వేల ఇళ్లు దెబ్బతిన్నాయని, అందులో 897 ఇళ్లు (నంద్యాల-554, ఆత్మకూరు-193, డోన్-150) తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. పూర్తిగా ధ్వంసమైన ఇళ్లకు రూ. 1.20 లక్షలు, పక్కా ఇళ్లకు రూ. 6 వేల, కచ్చా ఇళ్లకు రూ. 4 వేల చొప్పున పరిహారం ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా 36 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్స్యశాఖకు సంబంధించి 25 పడవలు, 34 చేప వలలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖకు చెందిన 27 రోడ్లు (సుమారు 110 కిమీ), పంచాయతీ రాజ్ శాఖకు చెందిన 6 రోడ్లు (సుమారు 32.85 కిమీ) నష్టపోయాయని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 17 వరకు దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లాలో అధిక వర్షాల కారణంగా వ్యవసాయం, హార్టికల్చర్ మినహా మొత్తం నష్టం రూ. 1686.01 లక్షలుగా అంచనా వేయబడిందని వివరించారు.

రివర్స్ స్ట్రాటజీ ద్వారా కుందూ నది నీటి మళ్లింపు : జిల్లాలో అధిక వర్షాల కారణంగా వెలుగోడు రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండడంతో, నీటిని కుందూ నదికి విడుదల చేసినట్లు తెలిపారు. అయితే, కుందూ నదిలో నీరు పెరిగితే నంద్యాల పట్టణానికి వరద ముప్పు ఉండే అవకాశం ఉన్నందున, రివర్స్ స్ట్రాటజీ ద్వారా కుందూ నదిలోని నీటిని గాలేరు%-%నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు మళ్లించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ చర్యలో జిల్లా మైనర్, మేజర్ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# ఢిల్లీకి 'ఇంద్రప్రస్థ' పేరు సూచన





న్యూఢిల్లీ, నవంబర్ 1 : మనగళం, దేశ రాజధాని ఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాలని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ డిమాండ్ చేశారు. ఢిల్లీ చరిత్ర, సంస్కృతి, భారతీయ నాగరికత మూలాలను ప్రతిబింబించేలా ఈ మార్పు అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు శనివారం లేఖ రాశారు. లేఖలో ఆయన పాత ఢిల్లీ రైల్వే స్టేషన్‌ను 'ఇంద్రప్రస్థ జంక్షన్'గా, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 'ఇంద్రప్రస్థ విమానాశ్రయం'గా మార్చాలని సూచించారు. ఢిల్లీ చరిత్ర వేల సంవత్సరాల నాటిదని, ఇది కేవలం ఆధునిక మహానగరం మాత్రమే కాదని, భారతీయ నాగరికత, ఆత్మకు ప్రతీక అని పేర్కొన్నారు. పాండవులు స్థాపించిన 'ఇంద్రప్రస్థ' నగరం సంప్రదాయం చరిత్రాత్మకమైనదని, ఆ నగర పేరు పునరుద్ధరించడం ద్వారా సంస్కృతి, విశ్వాసం, చరిత్ర పునరుజ్జీవితమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రవీణ్ ఖండేల్వాల్ లేఖలో ఇలా పేర్కొన్నారు: "ఢిల్లీ పేరు మార్పు చారిత్రక న్యాయం మాత్రమే కాదు, ఇది సాంస్కృతిక పునరుజ్జీవనానికి కూడా సంకేతం. ఢిల్లీని దాని అసలు రూపంలో గౌరవించాల్సిన సమయం వచ్చింది." ఆయన ఉదహరించినట్లుగా, దేశంలోని ప్రయాగ్‌రాజ్, అయోధ్య, ఉజ్జయిని, వారణాసి వంటి పురాతన నగరాలు తమ చారిత్రక మూలాలను తిరిగి పొందుతున్నాయన్నారు. అదే విధంగా ఢిల్లీ కూడా తన ప్రాచీన స్వరూపంతో తిరిగి కనెక్ట్ కావాలని కోరారు. "ఢిల్లీ భారతీయ నాగరికతకు చిహ్నం, ఆత్మ. ఢిల్లీని 'ఇంద్రప్రస్థ'గా మార్చడం ద్వారా రాజధాని కేవలం అధికార కేంద్రంగా కాకుండా మతం, నీతి, జాతీయవాదానికి ప్రతీకగా నిలుస్తుంది," అని ఆయన పేర్కొన్నారు. ఇక దేశ రాజధానిలో పాండవుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు. పాండవుల నీతి, ధర్మం, ధైర్యం వంటి విలువలు కొత్త తరానికి స్ఫూర్తినిస్తాయని వివరించారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తాతోపాటు ఇతర మంత్రులకు కూడా ఆ లేఖ ప్రతులను పంపినట్లు ఖండేల్వాల్ తెలిపారు. ఈ ప్రతిపాదనపై బీజేపీ వర్గాలు ఆసక్తిగా చర్చించుకుంటుండగా, ఢిల్లీ పేరు మార్పుపై కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# కర్నూలు ఉత్సవ్ ర్యాలీని ప్రారంభించిన టీజీ వెంకటేష్



వివరించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్య సామాజిక వర్గానికి మాత్రమే చేయలేదని, రాష్ట్రం కోసం, అన్ని సామాజిక వర్గాల కోసం, తెలుగువారి కోసం కృషి చేశారని వెల్లడించారు. అలాంటి గొప్ప వారిని ప్రతి సామాజిక వర్గం వారు గౌరవించాల్సిన అవసరం ఉందని వివరించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు కర్మయోగి అని ఆయన అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ రెండు రాష్ట్రాలు ప్రస్తుతం సోదర భావంతో ముందుకు వెళుతున్నాయని, ఇది సంతోషదాయకమని వెల్లడించారు. అమర జీవి పొట్టి శ్రీరాములు స్మారకార్థం అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం 50 అడుగుల విగ్రహంతో పాటు మ్యూజియం ఏర్పాటు చేస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రి , తన తనయుడు టీజీ భరత్ కోటి రూపాయలు ఏర్పాటు చేస్తానని ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రజలు గుర్తుంచుకునేలా ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు . కర్నూలు నగరంలో టీజీవి కళాక్షేత్రంలో వారం రోజులు పాటు జరిగే కర్నూలు ఉత్సవ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో వారం రోజులపాటు టిజీవి కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కర్నూల్ నగరంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ టీజీవి కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేసి కళాకారులను ప్రోత్సహిస్తున్నారని వెల్లడించారు.

# మాతృభాషపై హిందీ, ఇంగ్లీష్ ప్రభావం - సీఎం వ్యాఖ్యలు

మనగళం, బెంగళూరు, నవంబర్ 1 : హిందీని బలవంతంగా రుద్దుతున్నారంటూ తరచూ కేంద్రంపై దక్షిణాది రాష్ట్రాలు విమర్శలు వ్యక్తం చేస్తున్న సమయంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. హిందీ, ఇంగ్లీష్ భాషలు పిల్లల్లోని నైపుణ్యాలను బలహీన పరుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ సీఎం సిద్ధరామయ్య అభివృద్ధి చెందిన దేశాల్లో మాతృభాషలోనే ఆలోచనలు, లెర్నింగ్, కలలు ఉంటాయని, కానీ మన దేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. "మాతృభాషలో నేర్చుకుంటేనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది, ఆలోచనా విధానం విస్తరిస్తుంది," అని సీఎం అన్నారు.

కర్ణాటకపై సవతితల్లి వైఖరి

కేంద్రం కర్ణాటకపై సవతితల్లి వైఖరి ప్రదర్శిస్తోందని సిద్ధరామయ్య ఆరోపించారు. హిందీని బలవంతంగా రుద్దుతూ, హిందీ, సంస్కృత భాషల ప్రోత్సాహానికి మాత్రమే నిధులు కేటాయించి, ఇతర భాషలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు చేయాలి


**- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**





మనగళం, కర్నూలు సిటీ : ప్రతి పంటకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామంలో ఈ క్రాప్ నమోదును కలెక్టర్ పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన పంటలు వాస్తవంగా పొలాల్లో సాగు చేయబడుతున్నాయా లేదా అని పరిశీలించారు. పుల్లయ్య, లక్ష్మన్న రైతుల పొలాలను సందర్శించి ఉల్లిపాయ పంటను పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి ప్రస్తుత పంట స్థితి, పెట్టుబడి, సాగు విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. ఉల్లిపాయ పంటను రైజ్డ్ బెడ్స్ పద్ధతిలో సాగు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. తద్వారా భారీ వర్షాలు, నీటి నిల్వల కారణంగా పంట నష్టం జరగకుండా ఉంటుందని కలెక్టర్ సూచించారు. పత్తి రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న కోత వివరాలను తెలుసుకున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. మంచి నాణ్యత కలిగిన పత్తికి క్వింటాల్‌కు రూ. 8,110 ధరగా కొనుగోలు జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు పత్తిని శుభ్రంగా, పొడిగా, సరిగా ప్యాక్ చేసి విక్రయించాలన్నారు. ఉల్లిపాయ, పత్తి పంటలను కోత అనంతరం సరిగా ఆరబెట్టడం ద్వారా మెరుగైన నాణ్యతతో మంచి ధరలు పొందవచ్చని కలెక్టర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సాలు రెడ్డి, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు, మండల వ్యవసాయ అధికారి రుఫస్, హార్టికల్చర్ అధికారి నరేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో నవంబర్ 03 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజల నుండి వినతులు స్వీకరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చని సూచించారు. అదేవిధంగా అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవచ్చని వివరించారు.

## ప్రజారోగ్య అధికారి బాధ్యతల స్వీకరణ



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారిగా డా.వై.నాగప్రసాద్ బాబు బాధ్యతలు స్వీకరించారు. శనివారం నగరపాలక కార్యాలయంలోని ఆయన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, శానిటేషన్ ఇంస్పెక్టర్లు, ప్రజారోగ్య విభాగ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# విజయవాడకు ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ రైలు నడపాలి

**- మాజీ ఎమ్మెల్యే,ఎంఏ గఫూర్**




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నుండి విజయవాడకు ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ రైలు నడపాలని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో రాజశేఖర్ అధ్యక్షతన కర్నూలు నుండి విజయవాడకు రైళ్లను న డపాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షల ను ఎంఏ గఫూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కర్నూలు నుండి హైదరాబాదు ఇంటర్ సిటీ ఎక్స్ప్రెస్ కోసం సీపీఎం పోరాడిన ఫలితంగానే వచ్చిందని గుర్తు చేశారు. ఈ పోరాటంలో సీపీఎం నాయకుల పైన కేసులు బనాయించారని, కర్నూలు, సికింద్రాబాద్ కోర్టుల చుట్టూ తిరిగాల్సి వచ్చిందన్నారు. అప్పటి మంత్రి కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి సహకారంతో తాను ఎమ్మెల్యేగా రైలు సాధించామని, అయితే రాష్ట్రం విభజన జరిగిన తర్వాత దురదృష్టకరంగా మారిందన్నారు. కర్నూలు నుండి విజయవాడ వెళ్లడానికి ఇంటర్ సిటీ ఎక్స్ప్రెస్ రైలు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు నుండి మచిలీపట్నం వరకు నడిచే రైలు రద్దు చేశారని, దీన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. పంచలింగాల రైల్వే వేగన్ త్వరగా పూర్తిచేసి యువతకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కర్నూలు నుండి ఓర్వకల్ మీదుగా నంద్యాలకు రైలు మార్గం వెయ్యాలని వారు డిమాండ్ చేశారు. డబల్ ట్రాక్ మహబూబ్ నగర్ వరకు వచ్చి నిలబడి పోయిన డబల్ ట్రాక్ ను కర్నూలు నుండి డోన్ వరకు పొడిగిస్తూ కొనసాగించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు నగరం నుండి విజయవాడకు అనేకమంది వ్యాపారస్తులు ఉద్యోగస్తులు, అధికారులు పనుల నిమిత్తం వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. కర్నూలు నుండి విజయవాడకు ఇంటర్ సిటీ ఎక్స్ప్రెస్ నడపటం అవసరం ఎంతైనా ఉందన్నారు. కాచిగూడ నుండి గుంటూరు వరకు నడుస్తున్న రైలును విజయవాడ వరకు పొడగించాలన్నారు. కర్నూలు నుండి విజయవాడకు వెళ్లే రైళ్ల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి చేయాలని, కర్నూలు నగరం పాత రాజధాని అనే విషయాన్ని మర్చిపోకూడదని ఆయన గుర్తు చేశారు. అనంతరం సీఐటీయూ నగర కార్యదర్శి మారెళ్ళ విజయ, రామాంజనేయులు, ఆవాజ్ నగర కార్యదర్శిఎస్ ఎం డి షరీఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శ్యామల, నగర కార్యదర్శి బంగి పద్మ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ డి ఖాజా పాషా తదితరులు మాట్లాడారు. ప్రజా నాట్యమండలి కళాకారులు నాగరాజు, బాలు, లోకేష్, రాంబాబు, నాగస్వాములు, సరిత, లక్ష్మి తదితరులు ఆలపించిన ఉద్యమ గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఎంనగర కార్యదర్శి పి రాముడు, కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, డి అబ్దుల్ దేశాయ్, నరసింహ, సాయిబాబా, సుధాకర్ అప్పా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలి

**- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**





మనగళం, కర్నూలు సిటీ : విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామంలో ఉన్న ఉర్దూ హై స్కూల్ ను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు కిచెన్ షెడ్ ను పరిశీలించారు. ఈరోజు ఏమి వంట చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారు చేసే సమయంలో శుచి, శుభ్రత పాటించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులు లేకుండా కేవలం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారమే భోజనాలు పెడుతున్నారా? భోజనాలు రుచిగా ఉంటుందా ? పాలు ఇస్తున్నారా? ఉపాధ్యాయులు పాఠాలు ఏ విధంగా చెప్తున్నారు? అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించాలని కలెక్టర్ విద్యార్థులను ఉత్తేజ పరిచారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో ఉన్న సమస్యల గురించి హెడ్ మాస్టర్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ డీఈఓ ను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు, ఉర్దూ హై స్కూల్ హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 6న మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలు




మనగళం, కర్నూలు : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్( సీఐటీయూ) మూడవ జిల్లా మహాసభలు నవంబర్ 6వ తేదీన ఎమ్మిగనూరు పట్టణమునందు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబు తెలిపారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు ఓబులేష్ తో కలిసి అంజిబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో సీఐటీయూ నాయకత్వంలో అనేక పోరాటాలుచేయడం జరిగిందన్నారు. పోరాటాలను సమీక్షించుకొని రాబోవు కాలంలో నిర్వహించాల్సిన ఉద్యమాలను రూపొందించుకొనుటకు మహాసభలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ మహాసభలకు కర్నూలు నగరం ఆదోని ఎమ్మిగనూరు గూడూరు పట్టణాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందాలను అమలు చేయడంలో విఫలమైందని, వాటిని అమలుకు రాబోవు కాలంలో ఉద్యమాలు చేపడతామని ఆయన తెలిపారు.

## జీఎస్టీ వసూళ్లలో కొత్త రికార్డు..!

న్యూఢిల్లీ, నవంబర్ 1 మనగళం,: దేశ ఆర్థిక వ్యవస్థకు మరో ఉత్సాహపూరిత సంకేతం లభించింది. అక్టోబర్ నెలలో వస్తు మరియు సేవల పన్ను వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఒకే నెలలో దాదాపు రూ.1.95 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు జరగడం విశేషం. జీఎస్టీ అమలులోకి వచ్చిన 2017 తర్వాత ఇదే రెండవ అత్యధిక వసూళ్లు కావడం గమనార్హం. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈసారి వసూళ్లు 4.6 శాతం పెరిగాయి. 2024 అక్టోబర్‌లో రూ.1.87 లక్షల కోట్ల వసూళ్లు కాగా, ఈసారి రూ.1.95 లక్షల కోట్లకు చేరాయి. సెంట్రల్ జీఎస్టీ , స్టేట్ జీఎస్టీ , ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ అన్నీ సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. అయితే సెస్ వసూళ్లు మాత్రం స్వల్పంగా తగ్గాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల్లో (ఏప్రిల్%–%అక్టోబర్) మొత్తం జీఎస్టీ వసూళ్లు 9 శాతం వృద్ధిని సాధించాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకారం, 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇది అత్యధిక స్థాయిలో ఉన్న వసూళ్లు. అక్టోబర్ నెలలో జీఎస్టీ వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగం ద్వారా, రూ.50,884 కోట్లు దిగుమతులపై పన్నుల ద్వారా వచ్చాయి. రిఫండ్లు రూ.26,934 కోట్లు మినహాయించిన తర్వాత నికర వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లు నమోదయ్యాయి.

# అమరజీవికి ఘననివాళి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఆవిర్భావానికి మార్గదర్శకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం తెలుగు వారి గుండేల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి క్రిష్ణ అన్నారు. శనివారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నగరపాలక కార్యాలయంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకై చేసిన త్యాగం చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని, ఆయన చూపిన మార్గం ప్రజాసేవలో నిబద్ధత, త్యాగం, సేవాస్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని, ఆయన స్ఫూర్తిని మనం ఎప్పటికీ మర్చిపోరాదన్నారు. ప్రతి తెలుగు వాడు ఆయన త్యాగాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. మేనేజర్ ఎన్. చిన్నరాముడు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆత్మస్ఫూర్తి మనందరిలో నేటికీ జీవిస్తుందని, ఆయన విలువలను ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, సూపరింటెండెంట్ రామకృష్ణ, సిబ్బంది రాజు, శ్రీలక్ష్మి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవికి ఘన నివాళి



మనగళం, కోడుమూరు : కోడుమూరు బాలజీనగర్ లోని అసెంబ్లీ రూరల్ మండల బీజేపీ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అమరజీవి చిత్రపటానికి బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేల్పుల గోపాల్ మాట్లాడుతూ తెలుగు వారందరికీ చిరస్మరణీయుడు, అమరజీవి ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం 1952 అక్టోబర్ 19 నుంచి డిసెంబర్ 15 వ తేదీ వరకు దీక్ష చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాట ఫలితంగా 1953 అక్టోబర్ 1 న రెండు తెలుగు రాష్ట్రాల రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. రాష్ట్రావరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవిని ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోడుమూరు రూరల్ మండల అధ్యక్షులు బెస్త ఈరన్న, రాఘవఆచారి, రవికుమార్, చాకలి లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, రంగమ్మ, సుజాత, మాధవి, ఉమ, గౌరమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి



మనగళం, కర్నూలు సిటీ : ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ వెంటనే పూర్తి చేసి స్థానిక యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డీవైఎఫ్ఐ 46వ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర కార్యదర్శి హుస్సేన్ బాషా అధ్యక్షతన కొత్త బస్టాండు దగ్గర ఉన్న సంఘం జిల్లా కార్యాలయం దగ్గర జిల్లా కార్యదర్శి అబ్దుల్లా జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం మాటలతో స్వర్గం చూపిస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల కాలంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని ప్రచారం చేస్తుందన్నారు. 10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే కనీసం లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. పెట్టుబడుల పేరుతో రైతుల నుండి భూములు లాక్కోవడం తప్ప మరేం చేయలేదన్నారు. అత్యంత వెనకబడిన జిల్లాగా ఉన్న కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు టెక్స్టైల్ పరిశ్రమ, ఆలూరు జింకల పార్కు, ఆదోని జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమ, పత్తికొండలో టమాట ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి నిరుద్యోగాన్ని రూపుమాపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్ బాషా, జిల్లా సహాయ కార్యదర్శి ప్రకాష్, జిల్లా నాయకులు కిషన్, ఇమ్రాన్, ధను, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లాగ్ డే నిధికి విరాళాలు అందజేయాలి



మనగళం, కర్నూలు సిటీ : దేశ రక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేస్తున్న సాయుధ దళాల కుటుంబాల సంక్షేమం కోసం ఫ్లాగ్ డే నిధికి విరివిగా విరాళాలు అందచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మహిళా సంఘాలు సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ కు అందచేసిన రూ. 3 లక్షల విరాళానికి సంబంధించిన మెగా చెక్ ను శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మహిళా సంఘాల తరపున జిల్లా సమాఖ్య సభ్యులు జిల్లా కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు సంబంధించిన 30 వేల సభ్యుల నుండి, ప్రతి సభ్యురాలి నుండి రూ.10 చొప్పున సేకరించి, మొత్తం రూ.3 లక్షలను ఫ్లాగ్ డే నిధికి అందజేయడం మహిళా సంఘాల సామాజిక బాధ్యతకు నిదర్శనమని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని విరాళాలు అందచేయాలని కలెక్టర్ సూచించారు. తమ కుటుంబ సభ్యుడు సైనికుడిగా ఎదుర్కొంటున్న పరిస్థితిని చూస్తూ, సైనిక కుటుంబాలు ఎంతో బాధను అనుభవిస్తూ ఉంటాయని, ఆ కుటుంబాల్లో ఒకరిగా తనకు ఆ బాధ తెలుసు అని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు కూడా తమ వంతు సహకారం అందించాలని, దేశం కోసం సైనికులు చేస్తున్న త్యాగాలకు కృతజ్ఞతగా ఫ్లాగ్ ఫండ్ కు విరాళాలు అందచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్ డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వైపీ రమణారెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్న రూత్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె. సీతా బాయి, కార్యదర్శి బీఏ భాగ్యలక్ష్మి, ట్రెజరర్ జి. అరుణ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం





మనగళం, కర్నూలు క్రైం : ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలి



**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : ప్రభుత్వ అధికారులు తమ విధులను పారదర్శకంగా నిర్వహించి అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 2025 విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డీఆర్ఓ రాము నాయక్, ఎసిబి అధికారులు కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎటువంటి అవినీతి చోటు చేసుకోకుండా ఉండే దిశగా ప్రతి ఒక్క అధికారి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 122 శాఖల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కూడా ఒక ముఖ్యమైన విభాగమన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలు పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఎవరైనా తప్పు దారిలో వెళ్తే వారిని సరైన మార్గంలో నడిపించడంలో ఏసీబీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఏ శాఖలోనైనా ఒకరిద్దరు ఉద్యోగులు అవినీతికి పాల్పడితే, దాని చెడు ప్రభావం మొత్తం శాఖకు మోపడం వల్ల ప్రజల్లో ఆ శాఖపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్టర్ ప్రదర్శించి, ప్రజలకు అందించే ప్రతి సేవకు అవసరమైన సమయం, విధానం స్పష్టంగా చూపించాలన్నారు. అలాగే, ప్రతి ఉద్యోగి తమ వార్షిక రహస్య నివేదికలు మరియు ఆదాయ వివరాలను సమయానికి సమర్పించడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

అలాగే, ఏసీబీ అధికారులమంటూ ఫేక్ ఫోన్ కాల్స్ చేసి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ నగదు చెల్లించకూడదని, ఆన్లైన్ ద్వారా కూడా చెల్లింపులు చేయరాదు అని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పత్తి రైతులు నష్టపోకుండా మద్దతు ధర కల్పించాలి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పత్తి రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధర కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి జిన్నింగ్ మిల్లు ప్రతినిధులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తిని బాగా ఆరబెట్టి తీసుకొని వెళ్తే మంచి ధర వస్తుందనే విషయంపై రైతులలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. వర్షాల నేపథ్యంలో తడిసిన పత్తిని రైతులు ఆరబెడుతున్నా తేమ శాతం కొంచెం ఉంటుందన్నారు. తేమ 12 శాతం మాత్రం ఉంటేనే కొనుగోలు చేయకుండా, 14 శాతం తేమ ఉన్నా కూడా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కలెక్టర్ జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులను కోరారు. పత్తిని కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాలో అమౌంట్ ను వెంటనే జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ పత్తిని కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాలో అమౌంట్ ను జమ చేయడంలో అలసత్వం చేయకుండా వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ మొన్నటి నుండి 188 గ్రామాల్లో పత్తి కొనుగోలు ప్రక్రియ మొదలైందన్నారు. ప్రస్తుతం 139 రైతుల నుండి 3 వేల 12 క్వింటాల్ పత్తిని ప్రొక్యూర్ చేశారన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ లు తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

తుపానుతో తల్లడిల్లిన రైతు
– మళ్లీ నిలబడే ధైర్యం..

మొంథా తుపాను రెండు తెలుగు రాష్ట్రాలపై విపరీతమైన ప్రభావం చూపింది. ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు గోదావరి, కాకినాడ, కొందరు ఉత్తరాంధ్ర జిల్లాలు గాలివానలతో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నాయి. వందలాది ఎకరాల వరి, మిర్చి, పప్పు పంటలు నీటిలో మునిగిపోయి రైతుల కష్టానికి తాళం వేసినట్టైంది. అదే విధంగా తెలంగాణలో కూడా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తుపాను తాకిడి తీవ్రంగా ఉంది. చిన్న రైతు నుంచి పెద్ద రైతు వరకు ప్రతి ఒక్కరు నష్టాల వలయంలో చిక్కుకున్నారు. కష్టంతో పండించిన పంటలు నీటిలో కలిసిపోవడం రైతుల మనసుల్లో నిరాశను, భయాన్ని నింపింది.

తుపాను తాకిడితో కేవలం పంటలు మాత్రమే కాకుండా మట్టి సారమూ దెబ్బతింది. పంట పొలాల్లో మట్టిపొరలు కదిలిపోవడం వల్ల భవిష్యత్ విత్తనాలు వేసే అవకాశం కూడా కష్టమవుతోంది. పశువులకు మేత లేక, నిల్వ ధాన్యాలు చెడిపోవడం, విద్యుత్ లేకపోవడం, నీటి సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలు రైతు జీవితాన్ని పూర్తిగా అల్లకల్లోలంగా మార్చేశాయి. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా, రహదారి వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయం చేరుకోవడంలో కూడా ఆటంకాలు ఎదురవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నష్టాల అంచనాల కోసం అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బందిని రంగంలోకి దింపినా, ప్రాక్టికల్‌గా సహాయం రైతు చేతికి చేరడానికి సమయం పడుతోంది. తాత్కాలిక సాయం కంటే శాశ్వత పంట రక్షణ ప్రణాళికలు అవసరం. రైతులకు విత్తనాలు, ఎరువులు, వడ్డీలేని రుణాలు అందించడం వంటి చర్యలు తక్షణం ప్రారంభించాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో కూడా ఇలాంటి పరిస్థితులు తలెత్తాయి. పంట నష్టంతోపాటు, కూరగాయల ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయం రావడం ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసింది.

ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పుడు కేవలం పునరుద్ధరణ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ముందస్తు రక్షణ చర్యలను ప్రాధాన్యంగా చూడాలి. వాతావరణ మార్పులు తరచూ విపత్తులను తెస్తున్నాయి. నీటి నిల్వ వ్యవస్థలు, జల నియంత్రణ ప్రణాళికలు, ఆధునిక సాగు పద్ధతులు, బీమా విధానాలు రైతులకు భరోసా ఇవ్వగలవు. ఒకసారి విపత్తు వచ్చిన తర్వాత సాయం ప్రకటించడం కంటే, ముందుగానే రక్షణ చర్యలు అమలు చేయడం చాలా ముఖ్యం.

తుపానుతో నష్టపోయిన రైతు ఇప్పుడు తిరిగి నిలబడడానికి ధైర్యం అవసరం. పంటలు పోయినా, జీవితం పోయిందని రైతు అనుకోడు. ఆ ధైర్యాన్ని గుర్తించి ప్రభుత్వం ప్రతి రైతుకీ నూతన ఆశను నింపాలి. ఆర్థికంగా బలహీనుడైనా, ఆత్మబలంతో ముందుకు సాగే రైతు మన సమాజానికి అద్భుతమైన ప్రేరణ. ప్రభుత్వం, బ్యాంకులు, వ్యవసాయ సంస్థలు కలిసి సహకరించి రైతు మళ్లీ పంట వేయగల వాతావరణం సృష్టించాలి.

ప్రతీ విపత్తు మనకు పాఠం నేర్పుతుంది. కానీ ఆ పాఠాన్ని అమల్లోకి తేవడమే అసలు సవాలు. గత తుపానుల తర్వాత ఇచ్చిన హామీలు ఎక్కడ వరకు అమలయ్యాయో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈసారి ఆ తప్పు పునరావృతం కాకూడదు. రైతు జీవితంలో నమ్మకం నిలిపేలా నష్ట పరిహారం, పంట బీమా చెల్లింపులు వేగంగా జరగాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఈ విపత్తును పరస్పర సమన్వయంతో ఎదుర్కోవాలి. రెండు రాష్ట్రాల్లోనూ రైతుల బాధ ఒకటే, అవసరాలు ఒకటే. నీటి వనరులు, సాగు పద్ధతులు, మార్కెట్ పరిస్థితులు పరస్పరంగా ముడిపడి ఉన్నందున, సంయుక్త వ్యూహం అవసరం. రాష్ట్రాల మధ్య పోటీ కాకుండా, సహకారం ఉండాలి. తుపానులు తాత్కాలికమైనవైనా, రైతుల ఆత్మవిశ్వాసం శాశ్వతం. నేలతో బంధం ఉన్న మన రైతు మళ్లీ నేలను పట్టి ముందుకు సాగుతాడు. ఆంధ్ర – తెలంగాణ రైతు ఆశలను నిలబెట్టడమే మనందరి బాధ్యత. ప్రభుత్వాలు ఆ ఆశను బలపరచాలి

ు ఎందుకంటే రైతు ఆశే మన భవిష్యత్తు ఆహారం.

## కారు బోల్తా ఎంపీడీవోకు ఏ ఈ కి గాయాలు



మన గళండోన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మరియు అసిస్టెంట్ ఇంజనీర్ నారాయణ కలిసి ఆవుల దొడ్డి గ్రామానికి వెళుతుండగా కామ గాని కుంట్ల గ్రామ మలుపు వద్ద కారు బోల్తా ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారు సామాజిక ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు.

## సిద్ధనగట్టు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల



మన గళం ప్యాపిలి మండలంలోని సిద్ధనగట్టు గ్రామంలో ఈరోజు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పథకం వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు ఆర్థిక భరోసా అందిస్తున్నదని పేర్కొన్నారు. "ప్రతి పింఛన్ మీ భరోసా, ప్రతి రూపాయి మీ అండ" అని ఆయన తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెల్దుర్తి పట్టణంలో పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం.







మన గళం వెల్దుర్తి పట్టణంలోని రెండో సచివాలయ పరిధిలో పెన్షన్ల పంపిణీ పై తీవ్ర నిర్లక్ష్యం ఉందంటూ మహిళా పోలీస్ సిద్ధిక పై ప్రజలు ఎదురు తిరిగారు. గత కొంతకాలం నుంచి ఇంటి వద్దకు వచ్చి పంపిణీ చేయాల్సిన పింఛన్లను సచివాలయం వద్దకే వచ్చి తీసుకోవాలంటూ హుకుం జారీ చేయడం జరిగిందంటూ ప్రజలు తీవ్రమైన ఆవేదనను వ్యక్తం చేశారు. మీకు ఎన్ని పనులు ఉన్నప్పటికీ పింఛన్ కోసం సచివాలయం వద్దకే రావాలంటూ సచివాలయ ఉద్యోగి కరాకండిగా తేల్చి చెప్పారని బాధితురాలు చెప్పడం జరిగింది. కనీసం వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉన్న కనికరించడం లేదంటూ ప్రజలు తమ కోపాన్ని వ్యక్తం చేశారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ఉదయం 6 గంటల లోపు వాలంటీర్లు నేరుగా ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేసేవారనీ కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయం చుట్టూ తిరిగి పెన్షన్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందంటూ తెలిపారు.

## చిల్లబండ గ్రామంలో పింఛన్లు పంపిణీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల పరిధిలోని చిల్లబండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొగుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమము చిల్లబండ భాష ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు వృద్ధులకు ఆర్థిక భరోసా ఉండేలా పింఛన్లను సకాలంలో కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు ప్రతినెల పింఛన్ అందుతుందా అని ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పని చేస్తున్నారన్నారు. అలాగే మండల కోడుమూరు మండల కేంద్రంలో మాల మునిస్వామి, ప్యాలకుర్తి ఎస్సీ కాలనీలో ఆర్ చంద్రమౌళి, 205 బూత్ లో షేక్షావలి, మాదన్న పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్కీ రెడ్డి రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో ఏ.సీ. రాముడు, గోరంట్ల సర్పంచ్ బాలకృష్ణ, చంద్రమౌళి, రంగస్వామి, మాదన్న, అయ్యప్ప, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇండిగో ఫ్లైట్‌కు బాంబు బెదిరింపు-ముంబైకి మళ్లింపు

హైదరాబాద్,మన గళం : బాంబు బెదిరింపు నేపథ్యంలో జెడ్డా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానాన్ని ముంబైకి దారి మళ్లించారు. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం సుమారు 5.30 గంటల ప్రాంతంలో వారికి ఒక మెయిల్ ద్వారా బాంబు హెచ్చరిక సందేశం అందింది. ఆ మెయిల్‌లో "జెడ్డా నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో ఫ్లైట్ 6%జు% 68లో మానవ బాంబు ఉంది, 1984లో మద్రాస్ ఎయిర్‌పోర్టులో జరిగిన దాడిలా ఈసారి కూడా పెద్ద ఎత్తున దాడి జరుగుతుంది. ఈ దాడి వెనుక ఎల్‌టీటీఈ , ఐఎస్ఐ ఉన్నాయని" పేర్కొన్నారు. దీంతో ఎయిర్‌పోర్టు అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. తక్షణమే పైలట్‌కు సమాచారం అందించడంతో, విమానాన్ని హైదరాబాద్‌లో ల్యాండ్ చేయకుండా ముంబై వైపు మళ్లించారు. ముంబైలో సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికులందరినీ సురక్షిత ప్రదేశానికి తరలించి భద్రతా తనిఖీలు చేపట్టారు. ఇండిగో అధికార ప్రతినిధి ఈ విషయాన్ని ధృవీకరించారు. అధికారిక ప్రకటనలో "నవంబర్ 1న జెడ్డా నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో ఫ్లైట్ 6%జు% 68కు బాంబు బెదిరింపు మెయిల్ అందింది.

# దోర్నాలలో కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేసిన వైసీపీ నాయకులు

మనగళం : మొంథా తుఫాను కారణంగా ఇటీవల సంభవించిన వరదల కారణంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను యర్రగొండపాలెం శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారి ఆదేశాలతో వైస్సార్సీపీ దోర్నాల మండల పార్టీ అధ్యక్షులు ఘంటా వెంకట రమణారెడ్డి స్థానిక వైసీపీ నాయకులతో కలిసి కలెక్టర్ రాజబాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ తుఫాను నియోజకవర్గంలోని ఐదు మండలాలను (1.యర్రగొండపాలెం, 2.పుల్లలచెరువు, 3.త్రిపురాంతకం, 4.దోర్నాల, 5.పెద్ద ఆరవీడు) తీవ్రంగా ప్రభావితం చేసింది. దీని ఫలితంగా వ్యవసాయ పొలాలు మరియు మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిరంతర భారీ వర్షాలు మరియు పొలాల్లో నీరు నిలిచిపోవడం వల్ల, మొక్కజొన్న, పత్తి, మిర్చి, పొగాకు మరియు అరటి వంటి ప్రధాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రతి రైతు సాగు కోసం ఎకరానికి సుమారు 80,000 రూపాయలు పెట్టుబడి పెట్టాడు, కానీ పంటలు పూర్తిగా చెడిపోయాయి మరియు పొలాల్లో అధిక నీరు కారణంగా చాలా మొక్కలు చనిపోయాయి. వ్యవసాయ నష్టాలతో పాటు, కాలువలు పొంగి ప్రవహించడం వల్ల అనేక ప్రధాన రోడ్లు దెబ్బతిన్నాయి. దీని వలన గ్రామస్తులు ఒక గ్రామం నుండి మరొక





గ్రామానికి ప్రయాణించడం చాలా కష్టమైంది. ప్రదానంగా దోర్నాల మండలం లోని వెలిగొండ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ దెబ్బతినడంతో ముఖ్యంగా తీవ్రమైన సమస్య తలెత్తింది, దీని వలన నీరు దాని సాధారణ మార్గాన్ని అనుసరించకుండా సమీప గ్రామాలలోకి పొంగి ప్రవహిస్తోంది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, దెబ్బతిన్న విభాగాలను మరమ్మతులు చేయాలని మరియు ప్రధాన కాలువకు నీటి ప్రవాహాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. ఇంకా, బాధిత రైతులందరికీ తక్షణ నష్ట పరిహారం అందించాలని మరియు వారి నష్టాల నుండి కోలుకోవడానికి వారికి నష్టపరిహారం వెంటనే పంపిణీ చేయాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. మరో ప్రధాన సమస్య దోర్నాల మండలం లోని కొన్ని గ్రామలలో ప్రధాన రహదారులు వరద నీటిలో పూర్తిగా కొట్టుకుపోయినయి. గ్రామస్తులు అవసరమైన సామాగ్రిని పొందేందుకు మరియు సమీప ప్రాంతాలతో అనుసంధానించడానికి వీలుగా ఈ రహదారులను పునరుద్ధరించడానికి దయచేసి వెంటనే చర్య తీసుకోండి. దయచేసి ఈ సమస్యలను ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిశీలించి, అవసరమైన సహాయ మరియు పునరావాస చర్యలను వీలైనంత త్వరగా ప్రారంభించాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను.

# కోటకొండ కు చెందిన కమ్మరి దస్తగిరి హత్య కేసులోని ముద్దాయిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



మన గళం కోడుమూరు : కర్నూలు జిల్లా కోడుమూరు నందు గత నెల 27వ తారీకు జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు కోడుమూరు సిఐ తబ్రేజ్ తెలిపిన వివరాల మేరకు పి. కోటకొండ గ్రామమునకు చెందిన కమ్మరి దస్తగిరి(40) ఇతనికి 16 సంవత్సరముల క్రిందట దేవనకొండ మండలం చెల్లెలి చెలిమి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ అలియాస్ వరలక్ష్మి అను ఆమెని వివాహం చేసుకున్నాడు వారికి ఇద్దరు కుమారులు ఒక కూతురు వరలక్ష్మి ప్రవర్తన సరిగా లేదు అని ఆమె ఇతరులతో అక్రమ సంబంధము పెట్టుకున్నాడని ఆ విషయంలో పెళ్లి అయినప్పటినుండి వారి ఇద్దరి మధ్య మనస్పర్ధలు ఉండి వారి దాంపత్య జీవితంలో ఒడిదుడుకులతో సాగినది అని వారు వివరించారు ఆమె పి కోటకొండ గ్రామం నందు ఆశ వర్కర్ గా పని చేయుచు భార్యాభర్తల గొడవల వల్ల నాలుగు నెలల క్రిందట తన యొక్క ఉద్యోగాన్ని 2 లక్షలకు అమ్ముకొని కర్నూలుకి వెళ్లినది అని అక్కడ పెద్దపాడు రోడ్డులో ఉన్న హౌసన్నా మందిరం వద్ద ఇల్లు తీసుకొని ఉండగా అప్పటికి సుమారు 3 నెలల క్రిందట దస్తగిరి తన భార్య వద్దకు పోయి రాజీ అయినారు ఆ తర్వాత ఇద్దరు కలిసి కాపురం చేసుకుంటున్నారు అని అయినప్పటికీ కూడా దస్తగిరి వరలక్ష్మి యొక్క ప్రవర్తన పై అనుమానపడుచు ఇద్దరు గొడవపడుతూ ఉండి ఇప్పటికి సుమారు 15 రోజుల క్రిందట డ్యూటీ నిమిత్తము దస్తగిరి బళ్ళారి వెళ్లి అక్కడే ఉండగా అప్పుడప్పుడు తన భార్యకు ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయనందున గత మూడు రోజుల క్రిందట అతడు తిరిగి వచ్చి తన భార్య గురించి అనుమాన పడి ఆమెతో గొడవ పడుతూ ఉండటంతో ఆమె దస్తగిరిని చంపాలనే ఉద్దేశంతో 27వ తేదీ రాత్రి వరలక్ష్మి సొంత అన్న కమ్మరి శేఖరు, పెద్దమ్మ కొడుకు కమ్మరి వీరేశులు పిలిపించి దస్తగిరిని కట్టెలతో కొట్టి గాయపరిచి రాత్రి 10:30 గంటలకు వారు ముగ్గురు ఆటోలో కమ్మరి దస్తగిరిని తీసుకొని వచ్చి ప్యాలకుర్తి గ్రామ సమీపంలోని ఎర్రచందనం పార్కు బోర్డు వద్దగల చనుగొండ్ల గ్రామంనకు వెళ్ళు రోడ్డులో కిందకి దించి అతని మెడకు టవల్ చుట్టి ముగ్గురు కలిసి ఉరివేసి చంపి అక్కడే పడవేసి వెళ్ళగా కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసి కోడుమూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ విచారణ చేసి ముగ్గురిని శనివారము సాయంత్రం మూడు గంటలకు పత్తికొండ రోడ్లో గల కృష్ణాపురం క్రాస్ వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి నేరమునకు ఉపయోగించిన ఏపీ 07:00 టి యం 4066 నెంబర్ గల ఆటోను మరియు టవల్ను స్వాధీన పరుచుకున్నారు ముద్దాయిలను కోర్టుకు హాజరు పరిచారు ఈ కార్యక్రమంలో ఎస్సై డివై స్వామి ట్రైన్ ఎస్సై మణికంఠ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

మనగళం, కర్నూలు క్రైం : అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని, తెలుగు జాతి ఔన్నత్యాన్ని కాపాడిన త్యాగమూర్తి అని కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ లు కొనియాడారు.

శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో భాగంగా కర్నూల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా , ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా మాట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతో శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. భాష ప్రతిపాదికపైన ఏర్పడిన మొట్టమొదటి రాష్ట్రం మన ఆంధ్ర రాష్ట్రం అన్నారు. ఆంధ్రరాష్ట్రం 1953 అక్టోబరు 1వ తేదిన ఏర్పాటైనప్పటికీ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం వల్ల ఏర్పడిన భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1956 నవంబరు 1వ తేదిన ఏర్పాటయిందని, ఈ సందర్భంగా వారిని



గుర్తుచేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, సిఐ లు, ఆర్ ఐ లు, ఆర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిండుకుండల కృష్ణమ్మకి 31న కృష్ణమ్మ హారతి



మనగళం శ్రీశైలం : అక్టోబరు 22 నుంచి నవంబరు 21వతేదీ వరకు కార్తీకమాసోత్సవాలు నిర్వహింపబడనున్నాయి. ఈ సందర్భంగా కార్తీక రెండవ శుక్రవారమైన ( 31.10.2025) సాయంత్రం పాతాళగంగ వద్ద కృష్ణమ్మహారతి కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమములో పాతాళగంగ వద్ద నెల్పకొల్పబడిన కృష్ణవేణినదీమతల్లి విగ్రహానికి పూజాదికాలు, వస్త్ర సమర్పణ తదితర కార్యక్రమాలు జరిపించబడుతాయి. అదేవిధంగా పాతాళగంగ ఘాట్ వద్ద నీటిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషపూజాదికాలు, దశహారతులు సమర్పించబడుతాయి. అదేవిధంగా నదీమతల్లికి పూజాదికాలు, సారె సమర్పణ, దశహారతులను అర్పించబడుతాయి. ఈ హారతి కార్యక్రమునకు ముందు లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమము నిర్విఘ్నంగా జరగాలని ముందుగా మహాగణపతిపూజ జరిపించబడుతుంది. సంప్రదాయాన్ని అనుసరించి నదీమతల్లికి ఏకహారతి, నేత్రహారతి, బిల్వహారతి, నాగహారతి, పంచహారతి, సద్యోజాతాది పంచహారతులు, కుంభహారతి, నక్షత్రహారతి, రథహారతి, కర్పూరహారతులు ఇవ్వబడుతాయి.

దశహారతులు %-% ఫలితాలు

1. ఏకహారతి : ఈ ఏకహారతిని దర్శంచడం వలన భగవదనుగ్రహం లభిస్తుంది. అభీష్టాలు సిద్ధిస్తాయి. 2. నేత్రహారతి : ఈ నేత్రహారతి దర్శనం వలన ఆరోగ్యం చేకూరుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

3. బిల్వహారతి : ఈ బిల్వహారతి దర్శనం వలన సకల ఐశ్వర్యాలు కలుగుతాయి.

4. నాగహారతి : ఈ నాగహారతి దర్శనం వలన సమస్త సర్పదోషాలు తొలగిపోతాయి. వివాహం, సంతానం కలుగుతాయి.

5. పంచహారతి : ఈ పంచహారతిని దర్శించడం వలన ప్రకృతి వైపరీత్యాలు నివారించబడుతాయి. సకలశుభాలు కలుగుతాయి.

6. సద్యోజాతాది పంచహారతులు : ఈ సద్యోజాతాది పంచహారతి దర్శనం వలన శివకటాక్షం సిద్ధిస్తుంది. సకల సంపదలు కలుగుతాయి.

7. కుంభహారతి : ఈ కుంభహారతిని దర్శించడం వలన సకల శుభాలు కలుగుతాయి. సంపదలు కలుగుతాయి.

8. నక్షత్రహారతి : ఈ నక్షత్రహారతిని దర్శించడం వలన జాతకదోషాలన్ని తొలగిపోతాయి. చేపట్టిన పనులలో విజయం లభిస్తుంది.

9. రథహారతి: ఈ రథహారతిని దర్శించడం వలన పాపాలన్నీ పరిహరింపబడుతాయి. కోరికలన్నీ నెరవేరి సౌభాగ్యం, సౌఖ్యం చేకూరుతాయి.

10. కర్పూరహారతి : ఈ కర్పూరహారతి దర్శనం వలన మనోదోషాలు తొలగిపోతాయి. భగవంతుని కరుణాకటాక్షాలు లభిస్తాయి.

కాగా నదులు మన ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకలుగా చెప్పబడుతున్నాయి. మన నిత్యకృత్యాలైన స్నానపానాదుల నుంచి మనం ఆచరించే వైదిక కర్మల వరకు కూడా మనతో నదులు ముడి పడి యున్నాయి. అంతేకాకుండా నదులను మన ప్రత్యక్ష దైవాలుగా పేర్కొనడం జరుగుతోంది. అందుకే నదులను దైవస్వరూపాలుగా ఆరాధించడం, మాతృ స్వరూపంగా భావించడం మన సంప్రదాయమైంది. మనం పవిత్రంగా భావించే పంచ గంగ లలో కృష్ణవేణీనది కూడా ఒకటిగా చెప్పబడుతోంది. శ్రీశైలమహాక్షేత్రంలో కృష్ణానది పాతాళగంగ పేరుతో ఉత్తరవాహినిగా ప్రవహించడం వలన ఎంతో ప్రసిద్ధిని పొందింది. గంగోత్రిలోని గంగాజలాలు మిక్కిలి పవిత్రమైనట్లే శ్రీశైలంలోని కృష్ణా జలాలు కూడా ఎంతో ఫల వంతమైనవని చెప్పబడుతోంది.అందుకే దేవస్థానం లోకకల్యాణార్థమై ప్రతీ సంవత్సరం కార్తికమాసంలో నదీమతల్లికి హారతులను సమర్పించడం జరుగుతోంది.

# హెచ్‌డీఎఫ్‌సీ స్కీమ్ జాక్‌పాట్..!

న్యూఢిల్లీ, నవంబర్ 1మనగళం,: మీరు సంపాదించిన దాంట్లో నుంచి ఏమైనా ఆదా చేస్తున్నారా.. దీనిని పెట్టుబడులు పెడుతున్నారా.. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులపై దీర్ఘకాలంలో మంచి లాభాలు వస్తాయని నిపుణులు చెబుతుంటారు. దిగ్గజ పెట్టుబడిదారులు.. కూడా కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ కారణంతోనే.. ఇక్కడ ఇన్వెస్ట్ చేసేందుకు చూస్తుంటారు. కాంపౌండింగ్ అంటే చక్రవడ్డీ. అంటే వడ్డీపై వడ్డీ వస్తుందన్నమాట. దీంతో కాలం గడుస్తున్న కొద్దీ సంపద పెరుగుతూనే ఉంటుందన్నమాట. మ్యూచువల్ ఫండ్లలో సిప్ లేదా లంప్‌సమ్ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. సిప్ అంటే ప్రతి వారం, నెలనెలా, 3 నెలలకు ఓసారి.. సంవత్సరానికి ఒకసారి ఇలా సిప్ చేస్తూ పోవచ్చు. లంప్ సమ్ అంటే ఒకేసారి పెట్టుబడి పెట్టడం. చాలా మంది చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉన్నటువంటి సిప్ పెట్టుబడులపై ఆసక్తి చూపిస్తుంటారు. ఇక్కడ కనీసం రూ. 500 నుంచి కూడా సిప్ చేసేందుకు వీలుంటుంది.

# 'పెద్ది'లో జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్ అవుట్!






హైదరాబాద్, మనగళం, : గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్‌గా కనిపించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 మార్చి 27న విడుదల కానుంది.బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్షన్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జగపతిబాబు, దివ్యేందు భట్టాచార్య వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# సల్మాన్‌తో దిల్ రాజు కొత్త క్రేజీ ప్రాజెక్ట్!




హైదరాబాద్, నవంబర్ 1 మనగళం,: టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు మరోసారి భారీ స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమైన ఆయన ప్రయాణం, ఇప్పుడు టాలీవుడ్ అగ్ర నిర్మాతల జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌తో పాటు దిల్ రాజు డ్రీమ్స్ అనే కొత్త విభాగం ద్వారా యంగ్ టాలెంట్‌కి అవకాశాలు కల్పిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల 'గేమ్ ఛేంజర్' ,'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన దిల్ రాజు, ఇప్పుడు మరోసారి ప్యాన్-ఇండియా స్థాయిలో ప్రాజెక్ట్‌లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో పలు బడా హీరోలతో సినిమాలు తెరకెక్కించే ప్రణాళికలో ఉన్న ఆయన, ఈసారి బాలీవుడ్ వైపు దృష్టి సారించారు.వివరాల్లోకి వెళ్తే దిల్ రాజు బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌తో భారీ చిత్రాన్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్నారని వినికిడి. వీరిద్దరి కాంబినేషన్‌లో క్లాస్ టచ్‌తో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని టాక్. ఇప్పటికే సల్మాన్ ఖాన్ స్క్రిప్ట్‌ను విని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక, టెక్నీషియన్ల వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక సల్మాన్ రెమ్యునరేషన్ విషయానికి వస్తే .. ఈసారి లాభాల్లో వాటా తీసుకోవడానికి అంగీకరించారని వార్తలు వస్తున్నాయి. దిల్ రాజు ఈ ప్రాజెక్ట్‌ను భారీ బడ్జెట్‌తో నిర్మించాలనుకుంటున్నారని, సినిమాని ప్యాన్-ఇండియా లెవెల్‌లో విడుదల చేయాలనే లక్ష్యంతో ఉన్నారని టాక్. గతంలో 'హిట్', 'జెర్సీ' వంటి సక్సెస్‌ఫుల్ రీమేక్‌లతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న దిల్ రాజు, ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి మళ్లీ బాలీవుడ్ మార్కెట్‌లో తన ముద్ర వేయడానికి రెడీ అవుతున్నారు. దిల్ రాజు , వంశీ పైడిపల్లి - సల్మాన్ ఖాన్ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. మరి ఈ డ్రీమ్ ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభమవుతుందో చూడాలి.


# 'ఆంధ్ర కింగ్' రిలీజ్ ముందురోజేనా?

హైదరాబాద్, నవంబర్ 1,మనగళం, : ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా రూపొందిన ఈ చిత్రం నవంబర్ చివర్లో థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తాజా సమాచారం ప్రకారం సినిమా విడుదల తేదీలో చిన్న మార్పు చోటుచేసుకుంది. నిర్మాతలు మొదట ప్రకటించిన ప్రకారం ఈ చిత్రం నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఒక రోజు ముందుగానే ు నవంబర్ 27నే ు విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ అప్‌డేట్‌పై రామ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన థర్డ్ సింగిల్ 'చిన్ని గుండెలో' మంచి స్పందనను పొందింది. ప్రేమతో నిండిన ఈ మెలోడి సాంగ్ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటోంది. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనున్నారు. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మాస్, ఎంటర్‌టైన్‌మెంట్ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం రామ్ కెరీర్‌లో మరో హిట్‌గా నిలుస్తుందన్న నమ్మకం టీమ్‌లో కనిపిస్తోంది.



# నిశ్చితార్థం తర్వాత స్టేజీపై విజయ్ - రష్మిక






హైదరాబాద్, నవంబర్ 1 ,మనగళం,: టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన విజయ్ దేవరకొండ%-%రష్మిక మందన్న జంటపై కొత్త అప్డేట్ వెలుగులోకి వచ్చింది. గత కొన్నేళ్లుగా రూమర్ కపుల్‌గా పేరొందిన ఈ జంట నిశ్చితార్థం చేసుకున్నారనే వార్తలు ఇప్పుడు టాలీవుడ్ అంతా షేక్ చేస్తున్నాయి. ఇద్దరూ చాలా కాలంగా డేటింగ్‌లో ఉన్నారన్న వార్తల మధ్య తాజాగా జరిగిన నిశ్చితార్థం చర్చనీయాంశమైంది. అధికారిక ప్రకటన లేకపోయినా, ఇద్దరి టీమ్‌లు మీడియాకు సమాచారం అందించడంతో ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. ముఖ్యంగా, కొత్త రింగులతో ఈ ఇద్దరూ పబ్లిక్‌గా కనిపించడం ఆ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఇక రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' నవంబర్ 7న విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విజయ్ దేవరకొండ స్పెషల్ గెస్ట్‌గా హాజరుకానున్నారని సమాచారం. దీంతో నిశ్చితార్థం తర్వాత తొలిసారి ఒకే స్టేజీపై విజయ్%-%రష్మిక జంట కనిపించనుందనే వార్త అభిమానుల్లో ఉత్సాహం నింపింది. ఈ ఈవెంట్‌లో ఇద్దరూ ఒకే వేదికపై ప్రత్యక్షమైతే.. మీడియా ఫోకస్ మొత్తం వారిపైనే ఉండనుంది. వీరిద్దరూ ఈవెంట్‌లో ఎలాంటి హావభావాలు చూపిస్తారో, పెళ్లిపై ఏమైనా క్లారిటీ ఇస్తారా అన్నది ఇప్పుడు అభిమానుల కుతూహలంగా మారింది. "ఇది రీల్ లవ్ కాదు.. రియల్ లవ్ స్టేజ్!" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. గమనించదగిన విషయం ఏంటంటే.. రష్మిక, విజయ్ దేవరకొండ కలిసి నటించిన 'గీతా గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల సమయంలోనే వారిద్దరి మధ్య ప్రేమ మొలకెత్తినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌నే ఇద్దరి జీవితాల్లో కొత్త చాప్టర్ ఆరంభానికి వేదిక అవుతుందా? అన్న ఆసక్తి సినీ అభిమానుల్లో పెరుగుతోంది.

## వైభవంగా శ్రీరాములవారి విగ్రహావిష్కరణ



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : "శ్రీరాములవారి విగ్రహావిష్కరణ ద్వారా రామరాజ్యం రావాలని, రాములవారి కృపతో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని మంత్రి టీ.జీ. భరత్ తెలిపారు. నవంబర్ 1వ తేదీ శనివారం ఉదయం 8:30 గంటలకు కర్నూలు నగరంలోని మెయిన్ బజార్ శ్రీ రాములవారి ప్రధాన ద్వారం పై భాగాన " 13 " అడుగుల శ్రీరాములవారి విగ్రహావిష్కరణలో టి. జి. భరత్ తో పాటు ఆయన తండ్రి, మాజీ రాజ్యసభ సభ్యులు టీ.జీ. వెంకటేష్ కూడా పాల్గొన్నారు. టీ.జీ. వెంకటేష్ మాట్లాడుతూ కర్నూల్లోని అతి ప్రాచీనమైన రామాలయానికి సంబంధించిన అభివృద్ధి లో అన్ని విధాలుగా సంపూర్ణం గా సహకరిస్తామని తెలిపారు. అంతకుముందు టీజీ భరత్ టీ.జీ. వెంకటేష్ కు ఆలయ మర్యాదలతో పూల కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు హనుమేశాచార్యులు మాట్లాడుతూ "శ్రీరామ జయ రామ జయ జయ రామ" అనే 13 అక్షరాల కు సంకేతంగా 13 అడుగుల శ్రీరాములవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ స్వామిని సేవిస్తూ 13 సార్లు ప్రదక్షిణం చేసిన వారికి వారు కోరిన కోర్కెలు తీరుతాయని అయోధ్య రామ జన్మభూమి శ్రీ రామ మందిర నిర్మాణం సమితి లో కీలక పాత్ర పోషించిన శ్రీ పెజావర మఠం పీఠాధిపతి స్వామీజీ తెలియజేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయి రెడ్డి ,కరివెన సత్రం కార్యదర్శి డా. వేణుగోపాల్ , శ్రీ మేడా సుబ్రహ్మణ్యం(సుబ్బి స్వామి) , మాంటెస్సోరి పాఠశాలల అధినేత రాజశేఖర్, విశ్వహిందూ పరిషత్తు కర్నూలు జిల్లా అధ్యక్షులు మద్దిలేటి , క్రెడాయ్ కర్నూల్ చైర్మన్ గోరంట్ల రమణ,మాళిగి భానుప్రకాష్, చిల్కూరు నంద కిషోర్ , సత్య ప్రియ , దోమ రాంప్రసాద్ పాల్గొన్నారు.

## అమరజీవి త్యాగాలు చిరస్మరణీయం





మనగళం, కర్నూలు కార్పొరేషన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని మంత్రి టీజీ భరత్ కొనియాడారు. కర్నూలుశ్రీ పొట్టిశ్రీరాములు స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కమలాపురం శేషగిరి శెట్టి శనివారం పులబజార్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ అమరజీవి ప్రాణత్యాగంతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ అమరజీవి త్యాగాలను స్మరించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి టీజీ పిలుపు నిచ్చారు. అదేవిధంగా కర్నూలు నగర పరిధిలోని తొమ్మిదివ వార్డులో మంత్రి టీజీ భరత్ లబ్ధిదారులకు ఎన్టీఆర్ సామాజిక పింఛన్ అందజేశారు. లబ్ధదారులకు స్వయంగా నగదు అందజేసిన మంత్రి టీజీ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన తెలుపాలని, పరిష్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు హామీ ఇచ్చారు. మంత్రి వెంట వార్డు ఇంచార్జ కమలాపురం శేషగిరి శెట్టి, బూత్ ఇంచార్జ లు, అభిమానులు ఉన్నారు.

## శ్రేయస్ అయ్యర్‌కి డిశ్చార్జ్..



ముంబై, నవంబర్ 1,మనగళం, : క్రికెట్ అభిమానులకు నిజంగా ఆనందకరమైన వార్త. టీమ్ ఇండియా స్టార్ ప్లేయర్, మధ్యతరగతి బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. గాయంతో ఆసుపత్రిలో చేరిన ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో వైద్యులు ఇంటికి పంపించారు. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (%దీజజ×%) అధికారిక ప్రకటనలో వెల్లడించింది. బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. "శ్రేయస్ అయ్యర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. అతడి చికిత్సలో పాల్గొన్న సిడ్నీ వైద్య బృందం మరియు బీసీసీఐ మెడికల్ టీమ్ సంతృప్తి వ్యక్తం చేశారు. అందువల్ల ఆయన్ను ఈరోజు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయడం జరిగింది. అతడి కోలుకునే ప్రక్రియను కొనసాగిస్తూ, పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి తగిన సమయం ఇవ్వబడుతుంది" అని తెలిపింది. ఆస్ట్రేలియా పర్యటనలో మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ అయ్యర్‌కు గాయం అయిన విషయం తెలిసిందే. హర్షిత్ రానా వేసిన ఓవర్‌లో అలెక్స్ క్యారీ థర్డ్‌మ్యాన్ దిశగా బంతిని బలంగా కొట్టాడు. దానిని అద్భుతంగా డైవ్ చేస్తూ పట్టుకున్న అయ్యర్ ు ఆ క్షణం తర్వాత నొప్పితో నేలపై కూలిపోయాడు. ఎడమ వైపు పక్కటెముకల వద్ద తీవ్ర గాయం కావడంతో వెంటనే అతడిని సిడ్నీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు రెండు రోజులపాటు ఐసీయూలో వైద్యం అందించారు. ప్రస్తుతం అయ్యర్ ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడిందని, ఆయన శరీరంలో గాయాలు మానిపోతున్నాయని వైద్యులు పేర్కొన్నారు. అయితే పూర్తిగా మైదానంలోకి తిరిగి రావడానికి కనీసం మూడు వారాల సమయం పడుతుందని అంచనా. బీసీసీఐ వైద్య బృందం అతడి రికవరీపై నిత్యం పర్యవేక్షణ కొనసాగిస్తోంది. ఇక శ్రేయస్ డిశ్చార్జ్ వార్త తెలిసిన వెంటనే సోషల్ మీడియాలో అభిమానులు సంబరాలు జరుపుకుంటున్నారు. "వెల్‌కమ్ బ్యాక్ అయ్యర్! మిస్ అయ్యాం ఛాంప్!" అంటూ వేల సంఖ్యలో పోస్టులు చేస్తున్నారు. చాలామంది ఆయన త్వరగా మైదానంలోకి తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు. భారత జట్టుకు కీలక ఆటగాడిగా నిలిచిన శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫిట్‌గా మైదానంలో అడుగుపెడితే, రాబోయే దక్షిణాఫ్రికా సిరీస్, అలాగే టీ20 వరల్డ్‌కప్ 2026కు భారత జట్టు సమీకరణలో అతడికి ప్రధాన పాత్ర ఉండే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ధైర్యం, నిబద్ధత, పట్టుదలతో ఎన్నో గాయాలనుంచి తిరిగి వచ్చి జట్టుకు సేవలందించిన అయ్యర్ ఈసారి కూడా అదే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారని అభిమానులు నమ్ముతున్నారు. "ఫిట్‌నెస్ తిరిగి పొందే వరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, త్వరలోనే మైదానంలో చిరునవ్వుతో కనిపించాలని ఆశిస్తున్నాం" అని బీసీసీఐ అధికారులు తెలిపారు.

## దబాంగ్ ఢిల్లీ ఛాంపియన్-పుణేరిపై ఘన విజయం



న్యూఢిల్లీ, నవంబర్ 1, మనగళం,: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ టైటిల్ పోరులో దబాంగ్ ఢిల్లీ అద్భుత ప్రదర్శనతో మరోసారి ఛాంపియన్‌గా అవతరించింది. శుక్రవారం ఇక్కడి త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో ఢిల్లీ జట్టు 31%-%28 తేడాతో పుణేరి పల్టన్‌పై విజయం సాధించి రెండో సారి పీకేఎల్ కిరీటం దక్కించుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే ఢిల్లీ ఆధిక్యం సాధించింది. రైడర్ నీరజ్ నర్వాల్ అద్భుత ప్రదర్శనతో మొదటి అర్ధభాగంలో ఢిల్లీ 20%-%14 ఆధిక్యంలో నిలిచింది. పూణే తరఫున రైడర్లు శక్తివంతమైన దాడులు చేసినా, ఢిల్లీ డిఫెన్స్ గోడలాగే నిలిచింది. రెండో అర్ధభాగంలో పూణే ఒక్కదశలో గేమ్‌లోకి తిరిగి రావడంలో విజయవంతమై 28%-%30 వరకు స్కోరు తేడాను తగ్గించింది. కానీ చివరి నిమిషాల్లో ఢిల్లీ రక్షణ పటిష్టంగా నిలిచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఢిల్లీ విజయంలో నీరజ్ నర్వాల్ 9 పాయింట్లతో ప్రధాన పాత్ర పోషించాడు. సీజన్ అంతా స్థిరమైన ఆటతీరు కనబరచిన నవ్‌దీప్ 'బెస్ట్ డిఫెండర్'గా ఎంపికయ్యాడు. కాగా పాట్నా జట్టు రైడర్ అయాన్ 'బెస్ట్ రైడర్' అవార్డు గెలుచుకున్నాడు. ఢిల్లీ జట్టు కెప్టెన్ ఫజెల్ అత్రాచలి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ 'గా నిలిచాడు. ఈ ఘనవిజయంతో ఢిల్లీ జట్టు పీకేఎల్‌లో రెండో టైటిల్‌ను సొంతం చేసుకోగా, విజేతలకు రూ.3 కోట్ల ప్రైజ్‌మనీ బహుమతిగా అందజేశారు. అభిమానులు, క్రీడాభిమానులు ఢిల్లీ జట్టు విజయం సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. పీకేఎల్ 12వ సీజన్ మొత్తంలో ఢిల్లీ జట్టు తన క్రమశిక్షణ, సమన్వయం, వ్యూహాత్మక ఆటతీరుతో మిగిలిన జట్లకు ఆదర్శంగా నిలిచింది. కఠిన పోటీ మధ్య ఢిల్లీ మళ్లీ కప్‌ను కైవసం చేసుకోవడం, తమ స్థాయిని మరొకసారి నిరూపించడం కబడ్డీ అభిమానుల్లో ఉత్సాహాన్ని రగిలించింది.

## బాబర్ ఆజమ్‌కి టీ20ల్లో కొత్త రికార్డు



కరాచీ, నవంబర్ 1 మనగళం, : పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలో మరో మైలురాయిని నమోదు చేస్తూ మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రపంచ వ్యాప్తంగా టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా బాబర్ నిలిచాడు. దీంతో ఇప్పటి వరకూ భారత స్టార్‌లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పేర్లపై ఉన్న ఆ ఘనతను బాబర్ అధిగమించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో బాబర్ ఈ మైలురాయిని అందుకున్నాడు. ఇప్పటి వరకు ఆడిన 130 టీ20 మ్యాచ్‌ల్లో 4,234 పరుగులు చేసిన అతడు 36 హాఫ్ సెంచరీలు, మూడు సెంచరీలు సాధించాడు. అతడి స్ట్రైక్‌రేట్ 129గా నమోదైంది. టీ20ల్లో నిరంతర స్థిరమైన ప్రదర్శనతో అగ్రశ్రేణి బ్యాటర్లలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బాబర్, తిరిగి తన జట్టుకు విలువైన ఆస్తిగా రుజువయ్యాడు. ఇటీవల ఆసియా కప్‌లో చోటు దక్కకపోయిన బాబర్ ఆజమ్, తిరిగి జట్టులోకి వచ్చి అద్భుతమైన బ్యాటింగ్‌తో తన ప్రతిభను మరోసారి చాటుకున్నాడు.

## రో-కో ఇక్కడే ఉంటారు- అరుణ్ ధుమాల్



ముంబై, మనగళం, నవంబర్ 1 : భారత క్రికెట్‌లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన ప్రశ్న ు "రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ 2027 వన్డే వరల్డ్‌కప్ వరకు ఆడుతారా?" అన్నది. ఈ ప్రశ్నకు సమాధానం కోసం అభిమానులు, విశ్లేషకులు అంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా జరిగిన ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో ఈ ఇద్దరూ మరోసారి తమ క్లాస్‌ను నిరూపించారు. రోహిత్ ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ సాధించగా, కోహ్లీ కూడా ప్రమాదరహితంగా హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్%-%కోహ్లీ జంట, ఇప్పుడు వన్డేలకు మాత్రమే దృష్టి సారించింది. వచ్చే నెల దక్షిణాఫ్రికా సిరీస్ వరకు అంతర్జాతీయ క్రికెట్ నుంచి దూరంగా ఉంటారు. అయితే వీరు 2027 వరల్డ్‌కప్ వరకు కెరీర్‌ను కొనసాగిస్తారా? లేక కొత్త తరం ఆటగాళ్లకు స్థానం కల్పిస్తారా? అన్నది మేనేజ్‌మెంట్ నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ రోహిత్, కోహ్లీ భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ ు "భారత క్రికెట్ రిజర్వ్ బెంచ్ బలంగా ఉన్నా, రోహిత్, విరాట్ ఇంకా భారత్‌కు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిద్దరూ భారత జట్టుకు తమ అనుభవం, శక్తిని అంకితం చేశారు. రోహిత్ ప్రస్తుత ఫామ్‌లో ఉన్నాడు, ఆస్ట్రేలియా సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కించుకున్నాడు. వీరు ఎక్కడికీ వెళ్లరు, ఇంకా భారత క్రికెట్‌లో ఉంటారు" అని స్పష్టం చేశారు. అదే సమయంలో యువ ఆటగాళ్లు కూడా దూసుకెళ్తున్నారని పేర్కొన్నారు. "ఇప్పుడే పద్నాలుగేళ్ల వైభవ్ సూర్యవంశీ జట్టులో స్థానం కోసం సిద్ధమవుతున్నాడు. ఇది భారత క్రికెట్ భవిష్యత్తుకు మంచి సంకేతం. కానీ రోహిత్, కోహ్లీ వంటి దిగ్గజాలు తమ అనుభవంతో టీమ్‌కి ఇంకా బలాన్నిస్తారు" అని ధుమాల్ పేర్కొన్నారు.


Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310